క్లుప్తంగా

రక్తదానానికి ముందుకు రావాలి



ప్రశంసపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

హన్మకొండ అర్బన్ / కేయూ క్యాంపస్: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు కోరారు. హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం జులైవాడలోని లా కళాశాల హాస్టల్‌లో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పద్మజారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తలసేమియా బాధితులను కాపాడేందుకు రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో హాస్టల్ జాయింట్ డైరెక్టర్ ఎన్.శ్రీనివాస్, వై.ప్రభాకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.హరిప్రసాద్, ఆర్గనైజర్ చిదురాల రాజు, రెడ్‌క్రాస్ సభ్యులు అలువాల కార్తీక్, లా హాస్టల్ విద్యార్థులు రాము, కృష్ణ, నరేష్, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్ : వరంగల్ జిల్లాస్థాయి క్రీడలకు సంబంధించిన ఎస్‌జీఎఫ్‌ఐ సెక్రటరీ నియామకానికి జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ డైరెక్టర్), పీఈటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. అసక్తి గల వారు ఈనెల 22 వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

కాళోజీ సెంటర్ : రాష్ట్ర మహిళా, శిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వర్తిస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్, సామాజిక కార్యకర్త మండల పరశురాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో సుమారు 100 మంది వరకు అసిస్టెంట్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేస్తున్నారని, వారిని 2012లో విధుల్లోకి తీసుకున్నారని వివరించారు. చాలీచాలని జీతాలతో వారి జీవితాలు దుర్భరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి చెల్లిస్తున్న మాదిరిగానే వీరికి కూడా నెలకు రూ.19,500 చెల్లించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఆది మూలగణపతికి పూజలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని ఆదిమూల గణపతికి లక్ష గరికలతో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయ వ్యవస్థాపకుడు ఐనవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పండితులు గణపతి వ్రతం జరిపించారు. అన్నపూర్ణ కేంద్రంలో భక్తులకు మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, గంగుల రాజిరెడ్డి, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ పాల్గొన్నారు.

కాజీపేట ఏసీపీకి అభినందనలు

కాజీపేట అర్బన్: కాజీపేట ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన డేవిడ్‌రాజ్‌ను కడిపికొండకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బస్కే రాజేందర్, గొర్రె సుధాకర్, పంగ సతీష్, శివరాజు, గడ్డం రవి పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌పీకి ఘన స్వాగతం

హసన్‌పర్తి: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు హసన్‌పర్తిలో ఘన స్వాగతం లభించింది. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని సమావేశానికి కరీంనగర్ నుంచి ఎల్లాపురం మీదుగా గురువారం వెళ్తున్న క్రమంలో ప్రవీణ్‌కుమార్‌కు హసన్‌పర్తి వద్ద బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు బొకేతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి సునీల్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శనిగరం రాజు, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాదారపు రవికుమార్, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు చాతళ్ల వేణుగోపాల్, మహిళా విభాగం జోన్ కన్వీనర్ పద్మ, జిల్లా కన్వీనర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఓ సిటీ స్టేడియంలో పీరీల ఏర్పాటు

- హిందూ సంఘాలు చేరుకోవడంతో తొలగించిన పోలీసులు

కాశిబుగ్గ: వరంగల్ ఓ సిటీలోని జిల్లా యువజన క్రీడల కార్యాలయం ఆధీనంలో ఉన్న స్టేడియంలో గురువారం రాత్రి ఓ వర్గానికి చెందిన వారు పీరీలు ఏర్పాటు చేశారు. అది తెలుసుకున్న హిందూ సంఘాల నాయకులు అక్కడికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈ స్టేడియంలోనే పోచమ్మతల్లి విగ్రహం ఏర్పాటు చేసినప్పుడు తొలగించిన అధికారులు.. ఇప్పుడు పీరీల ఏర్పాటుకు ఎలా ఒప్పుకున్నారని, వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దాంతో మిల్స్‌కాలనీ పోలీసులు స్టేడియం వద్దకు చేరుకుని ఇరు వర్గాలతో మాట్లాడి పీరీలను తొలగించారు.

విడవని వాన.. తగ్గని వరద

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా నగరంలో మంగళవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. దాంతో లోతట్టు ప్రాంతాలు, కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. చెరువులు మత్తడి దుంకాయి. చెట్లు నేలకొరిగాయి. వాన, వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సహాయక చర్యలు చేపడుతున్నారు.

- సాక్షి నెట్‌వర్క్



కాజీపేట చౌరస్తాలో కురుస్తున్న వర్షం



వరంగల్ రైల్వే స్టేషన్ జంక్షన్‌లో నిలిచిన వర్షపు నీరు



ఖిలా వరంగల్: పూర్ణోదయకాలనీ రోడ్డుపై కూలిన వృక్షం



హనుమకొండలోని అంబేద్కర్ భవన్ వద్ద రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ



హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నేలకూలిన భారీ వృక్షం



వరంగల్ హెడ్‌పోస్టాఫీస్‌కు వెళ్లే దారిలో రోడ్డుపై వరద



హనుమకొండలోని జిల్లా గిరిజన కార్యాలయ ఆవరణలో..



హనుమకొండ భవానీనగర్‌లో పొంగిపొర్లుతున్న వర్షపు నీరు

ఆ పాఠశాలలపై చర్య తీసుకోవాలని వినతి



హన్మకొండ: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వం విద్యా సంస్థలకు రెండు రోజులు సెలవులు ప్రకటించినా దాన్ని పాటించకుండా పాఠశాలలు నడిపిస్తున్న యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి ఓర్సు చిరంజీవి డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ వడ్డేపల్లిలోని ఎంఈఓ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారి ఇ.రామకిషన్ రాజుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యను వ్యాపారం చేస్తూ అంగట్లో సరుకులాగా మారుస్తూ ప్రభుత్వ జీఓలు పట్టించుకోకుండా తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల గుర్తింపును రద్దు చేయాలని పేర్కొన్నారు.

ఎస్‌ఆర్‌ఐ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

హసన్‌పర్తి: విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న ఎస్‌ఆర్‌ఐ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఏబీఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కళాశాల ఎదుట గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ ఫీజుల పేరిట విద్యార్థులను కళాశాల నిర్వాహకులు వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజ్, సాయి, కిరణ్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అరెస్టు సిగ్గుచేటు



కరీమాబాద్: మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి



కాశిబుగ్గ: మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కరీమాబాద్: హైదరాబాద్ బాటసింగారంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను సందర్శించేందుకు గురువారం వెళ్లిన కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం సిగ్గుచేటని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి అన్నారు. వరంగల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని అరెస్టు చేయడాన్ని ప్రతీఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలపై పోరాడే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాంగం అమలవుతోందని ఆరోపించారు. సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బన్న ప్రభాకర్, మల్లాడి రాంరెడ్డి, తాళ్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి అరెస్టు అప్రజాస్వామికం

కాశిబుగ్గ: కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టును బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తీవ్రంగా ఖండించారు. ఓసిటీలోని తన నివాసంలో ఆయన గురువారం మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించడానికి వెళ్తున్న కేంద్రమంత్రిని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంజిత్, నాయకులు ఉన్నారు.



వరంగల్ చౌరస్తా: నినాదాలు చేస్తున్న నాయకులు

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

వరంగల్ చౌరస్తా: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వరంగల్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం సాయంత్రం దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకుడు కుసుమ సతీష్ మాట్లాడుతూ హక్కులకు నిరసిస్తే, హామీలపై నిలదీస్తే, అసమర్థతపై గొంతెత్తితే, అన్యాయంపై పోరాడితే అక్రమ అరెస్టులా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాకం హరిశంకర్, శ్రీనివాస్ గుప్తా, కనుకుంట్ల రంజిత్, ఏరుకుల రఘునారెడ్డి, పిట్టల కిరణ్, జలగం రంజిత్, మార్టిన్ లూథర్, గట్టికొప్పుల రాంబాబు, బైరి శ్యాంసుందర్, అపురూప రజిని నేత, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వివాహిత అదృశ్యం

రామన్నపేట: హనుమకొండ జిల్లా శాయంపేటకు చెందిన తోట రమ అనే వివాహిత ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రిలో నుంచి రమ తప్పిపోయిందని వివరించారు. ఆచూకీ తెలిసిన వారు 87126 85005, 87126 85117 నంబర్లకు కాల్‌చేసి సమాచారం అందించాలని సీఐ కోరారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన ఓ విద్యార్థిని గుర్తుతెలియని క్రిమిసంహారక మందు పేస్ట్ తిని చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన గోపు రాజు కూతురు గోపు సింధూష(12) స్థానిక పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతోంది. ఈనెల 17వ తేదీన తన ఇంటి ముందు కొట్టంలో స్నేహితులతో సింధూష ఆడుకుంటూ అవగాహన లేక అక్కడున్న గుర్తు తెలియని క్రిమిసంహారక మందు పేస్ట్ తిన్నది. దాంతో అదేరోజు రాత్రి అస్వస్థతకు గురికాగా, నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. ఆరోగ్యం కుదటపడడంతో ఇంటికి తీసుకొచ్చారు. మళ్లీ అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి హైదరాబాద్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వలీ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట రూరల్: గుర్తు తెలియని సుమారు 50 ఏళ్ల వ్యక్తి కాజీపేట జంక్షన్‌లో గురువారం మృతి చెందాడు. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ దయాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట జంక్షన్‌లో 2వ నంబర్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి వివరాలకు కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో లేదా 98663 30257, 94932 01968 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో పాడిగేదెల మృత్యువాత

న్యూశాయంపేట: 36వ డివిజన్ చంద్రవదన్‌కాలనీ జేబీనగర్‌లోని పోచమ్మ గుడి వద్ద ఇజ్జగిరి శంకర్‌కు చెందిన పాడిగేదె విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పచ్చిక బయళ్లలో మూడు పాడిగేదెలు మేత మేస్తున్న క్రమంలో కరెంట్ స్తంభానికి ఉన్న స్టే వైర్‌కు విద్యుత్ సరఫరా కాగా, అందులోని ఒక గేదె మృతి చెందింది.

చింతల్‌లో..

ఖిలా వరంగల్: 36వ డివిజన్ చింతల్‌కు చెందిన ఇజ్జగిరి అరుణ, రాజేందర్‌కుమార్ దంపతులకు చెందిన పాడి గేదె.. ఇంటి పక్కనే ఉన్న సపోర్ట్ వైర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.85వేల ఉంటుందని, తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

డీఆర్‌ఎంకు సన్మానం

కాశిబుగ్గ: డీఆర్‌ఎం అభయ్‌కుమార్ గుప్తాను సికింద్రాబాద్ రైల్వే నిలయంలో జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు చింతాకుల సునీల్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే ఇచ్చి సన్మానించారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలని ధర్నా



బురదరోడ్డుపై ధర్నా చేస్తున్న నాయకులు

హన్మకొండ: హనుమకొండ అంబేద్కర్ భవన్ నుంచి సమ్మయ్యనగర్ మీదుగా 100 ఫీట్ల రోడ్డును కలిపే 80 ఫీట్ల రోడ్డు నిర్మాణాన్ని చేపట్టని రహదారులు, భవనాల శాఖ అధికారులను సస్పెండ్ చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు 80 ఫీట్ల రోడ్డుపై సీపీఎం ఆధ్వర్యంలో సమ్మయ్యనగర్, ఇంజనీర్స్ కాలనీ, గోపాల్‌పూర్ వాసులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ ఈ రోడ్డులో డక్ట్ అండ్ డ్రైన్ నిర్మాణం పూర్తై ఏడాది దాటుతున్నా రోడ్డు పనులను పూర్తి చేయడంలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై గుంతల్లో వరదనీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే, వరద ముప్పును నివారించడానికి డక్ట్ అండ్ డ్రైన్ నిర్మాణానికి కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ధర్నాలో సీపీఎం హనుమకొండ మండల కమిటీ కార్యదర్శి వాంకుడోతు వీరన్న, నాయకులు రవీందర్, పెద్ద వెంకటయ్య, కూస రాజేష్, జీడిమెట్ల అరుణ, బొట్ల లత, వెంకన్న, స్వప్న, నరేష్ పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు



ఎంజీఎం: మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

హన్మకొండ: పాత పింఛన్‌ను అమలు చేయాలని తెలంగాణ ఉద్యోగుల పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ రాంనగర్‌లోని స్వగృహంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు కలకోట్ల చిరంజీవి, గుంటి వేణుగోపాల్, తోట రమేష్ గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలని సూచించారు. 2004, సెప్టెంబర్ 1కి ముందే తెలంగాణలో ఉద్యోగుల నియామకాలు పాత పెన్షన్ పద్ధతిలోనే జరిగాయని గుర్తుచేశారు. నూతనంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ఎత్తివేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల పాత పెన్షన్ పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎ.రాజు, ప్రధాన కార్యదర్శి దయాకర్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి కిషోర్, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, రాజకుమార్, సుధాకర్, రమేష్, పద్మశ్రీ, ప్రతిభ, ఊర్మిళ, అనిత పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేయాలి

ఎంజీఎం: పాత పింఛన్ సాధనే ధ్యేయంగా చేపడుతున్న రథయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం, ఎంజీఎం ఆస్పత్రి, వర్ధన్నపేట ఆస్పత్రుల్లో పాత పెన్షన్ సాధనే ధ్యేయంగా చేపడుతున్న పలు కార్యక్రమాలపై ఉద్యోగులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతపెన్షన్ సాధన రథయాత్ర 21న సాయంత్రం వరంగల్‌కు చేరుకుంటుందని తెలిపారు. వెంకట్రామ థియేటర్ మీదుగా జేపీఎన్ రోడ్డు, పోచమ్మ మైదాన్, ములుగు రోడ్డు, హనుమకొండ చౌరస్తా, పోలీసు కమిషనరేట్, నక్కలగుట్ట, అదాలత్ మీదుగా సుబేదారి అమరవీరుల స్తూపం వరకు రథయాత్ర చేరుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు రవీందర్, జీవన్‌కుమార్, నర్సింగ్ విభాగ అధ్యక్షురాలు ప్రేమలత, సరళ, సుప్రియ, శైలజ, అఫ్షన్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తిచేయాలి

- అధికారుల సమీక్షలో కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: వరంగల్ జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. మన ఊరు–మన బడి, మినీ డెయిరీ ప్రాజెక్టు, ఉద్యాన పంటల సాగు, హరితహారం, గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణం తదితర అంశాలపై గురువారం కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల చివరి వరకు పూర్తి చేస్తామన్న పాఠశాలల్లో పనులు కచ్చితంగా పూర్తవ్వాలని స్పష్టం చేశారు. హరితహారంలో జిల్లాలో 25,95,150 మొక్కలు నాటాల్సి ఉందన్నారు. గ్రామ పంచాయతీ భవనాల పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. స్థలం విషయంలో సమస్యలుంటే తహసీల్దార్‌ను సంప్రదించి పనులు పూర్తిచేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు పాల్గొన్నారు.



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఈవీఎంలపై ప్రచారం చేయాలి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)పై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం ఈవీఎంల ప్రదర్శన, అవగాహన కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలోని 3 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఒక ఈవీఎం అవగాహన కేంద్రం, మొబైల్ సంచార ప్రదర్శన రథాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ శ్రీవత్స తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీఓ వాసుచంద్ర

వరంగల్ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీఓ)గా నియమితులైన వాసుచంద్ర గురువారం కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ శ్రీవత్సను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూల మొక్కలు అందజేశారు. ఈక్రమంలోనే ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించారు.

క్యారమ్స్ 'ట్రాన్స్‌కో' విజేతలకు సన్మానం



విజేతలను సన్మానిస్తున్న చీఫ్ ఇంజనీర్, ఎస్‌ఈలు

వరంగల్ చౌరస్తా: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విద్యుత్ ఉద్యోగులకు జరిగిన క్యారమ్స్ పోటీల్లో వరంగల్ ట్రాన్స్‌కో ఉద్యోగులు ప్రతిభ కనబరిచారు. ఈమేరకు ములుగు రోడ్డులోని ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ శ్రీరామ్‌కుమార్, ఎస్‌ఈ చంద్రశేఖర్‌ను గురువారం సన్మానించారు. ఈనెల 18నుంచి 19వ తేదీ వరకు వివిధ కేటగిరీల్లో పోటీలు జరగగా, తెలంగాణ రాష్ట్ర స్థాయి ఈవెంట్‌లో ఎస్‌ఈ ఓఎంసీ వరంగల్ టీం రెండవ స్థానంలో, సింగిల్ విభాగంలో ఫోర్‌మెన్స్ మొదటి బహుమతి సాధించారు. ఓపెన్ డబుల్ విభాగంలో దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, తీగల కల్యాణ్, మురళి ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో క్రీడల కౌన్సిల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.రాజ్‌కుమార్, ఎం.వెంకటేశ్వర్లు, కె.ప్రవీణ్, రాజారెడ్డి, యాకుబ్, ఎం.దేవేందర్ రెడ్డి, ఎస్.అశోక్, బోస్‌బాబు, మాధవరెడ్డి, శ్రీనాథ్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిరుపేద అన్నాచెల్లెలికి చేయూత



కాజీపేట రూరల్: అన్నాచెల్లెలైన ఇద్దరు నిరుపేద విద్యార్థులకు కాజీపేట ఫాతిమానగర్ సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ కో ఆర్డినేటర్ వై.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా ఘన్‌పూర్ మండలం కంచన్‌పల్లి గ్రామానికి చెందిన అన్నాచెల్లెలు కమల్, సౌజన్యల తల్లిదండ్రులు కొంతకాలం క్రితం చనిపోయారు. ఉండటానికి ఇల్లులేని ఆ నిరుపేద విద్యార్థులు కమల్ ఇంటర్, సౌజన్య 10వ తరగతి అష్టకష్టాలు పడుతూ చదువుకుంటున్నారు. ఈ మేరకు వారికి భాస్కర్‌రెడ్డి తన స్నేహితుల సహకారంతో రూ.18 వేల నగదును అందజేశారు. సిస్టర్స్ లూర్దుమేరి, ఆరోగ్యమ్మ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని తోళ్ల పరిశ్రమలు

వరంగల్: ఏనుమాముల గ్రామ శివారులో చట్ట వ్యతిరేకంగా నడుస్తున్న తోళ్ల పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గంధం శివ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ఏనుమాముల గ్రామ శివారులో పలు లెదర్ ఫ్యాక్టరీలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యాంగా నడుస్తున్నాయని తెలిపారు. భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరగడంతో కార్మికులు ఆస్పత్రుల పాలవుతున్నారని పేర్కొన్నారు. అలాగే, దేశాయిపేట, ఏనుమాముల, బాలాజీనగర్, సుందరయ్యనగర్, ఎంహెచ్‌నగర్, మధురానగర్, శ్రీలక్ష్మీగణపతి కాలనీ, ఎస్సార్‌నగర్, ఇందిరమ్మకాలనీ, రెడ్డిపాలెం తదితర శివారు గ్రామాల్లోని భూగర్భ నీరు కలుషితం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో ఆయా కాలనీల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.